# విలువలు

కళ్యాణి



మదువుగా, మంద్రస్థాయిలో విని పిస్తున్న సన్నాయి బ్యాండు మేళాల హోరులో విసిగిన చెవులకు [illegible] ఉంది. పెళ్ళి అనగానే సందడి సంతోషం పోయి ఈ మధ్య ఆర్భాటం, గందరగోళం, హోరు ఎక్కువైపోయాయి. ఎక్కడకు వెళ్ళాలన్నా [illegible] ఏర్పడుతోంది. కానీ, కొన్ని కొన్ని సంఘ మర్యాదలు తప్పనిసరి. అలా తప్పని సరిగా బయలుదేరి వచ్చింది కాత్యాయని యీ రోజు స్నేహితురాలి కూతురు పెళ్ళికి సన్నాయి అడుగులో అడుగు వేస్తూ, చుట్టూ పరికిస్తూ లోపలికి నడిచింది.

"రండి! రండి! చాలా ఆలస్యంగా వచ్చారు. ఇప్పుడారావటం?" ఆప్యాయంగా ఆదరంగా ఎదురు వచ్చాడు పిల్ల తండ్రి.

"అనుకోకుండా చుట్టాలు వచ్చారు. పెళ్ళిళ్ళ సీజను కదా! వాళ్ళను ఆ పెళ్ళి మండపం దగ్గర వదిలి వచ్చేటప్పటికి కొంచెం ఆలస్యమైంది." సంజాయిషీ చెప్తూ వెంట నడిచింది.

"రావే! రా! ఇప్పటికైనా వచ్చావు! రా! ఈ అక్షింతలు వెయ్యి. లోపల భోజన ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయో చూడాలి పద. నన్ను విడిచి ఎటూ పోకు. నేను చెప్పేదాకా ఇంటికి వెళ్ళకూడదు తెలిసిందా?" అన్నిరకాల అక్షింతలు పెట్టి వెంట లాక్కుపోయింది శ్రీదేవి, పెళ్ళికూతురు తల్లి. చేతిలోని కానుక పెళ్ళికూతురి చేతిలో పెట్టి చిరునవ్వుతో వీడ్కోలు తీసుకుని శ్రీదేవితో వెళ్ళింది కాత్యాయని.

భోజనాలు అయ్యాక తాంబూలాలు వేసుకుంటూ అందరూ కూర్చున్నారు. శ్రీదేవి కాత్యాయనిని అందరికీ పరిచయం చేసి తన పని మీద వెళ్ళింది, కాత్యాయనిని మరోసారి హెచ్చరించి.

"సరేలే వెళ్ళను. పోయి స్థిమితంగా నీ పని చూసుకో." నవ్వుతూ భరోసా ఇచ్చింది.

"చెప్పకుండా మాయమవుతుంటారేమిటి?" ఎవరో నవ్వులాటగా అడిగారు.

"అదేం లేదండి. పెళ్ళికి వచ్చాక అదెలా కుదురుతుంది? ఏదో తన ఆప్యాయత" మాటలు అటు తిరిగి ఇటు తిరిగి చీరల మీద, ధరలు, డిజైన్లు, విలువలు వైభోగాల వైపు మళ్ళాయి.

"మీరు కట్టుకున్న చీర చాలా బావుంది ఏం చీర?"

"తెలియదండి"

"అదేమిటి? కొనుక్కునేటప్పుడు అన్నీ అడగకుండానే కొంటారా? ధర ఒక్కటే కాదుగా ముఖ్యం. గుడ్డ మన్నిక, నేత, ఏ ఊరి చీర అవన్నీ అడగరా? మాలాంటి వాళ్ళు అడిగితే చెప్పటానికైనా"

"అదికాదు ఇది ఎవరో బహుమతిగా ఇచ్చారు. వాటిని గురించి వాళ్ళను వివరాలేం అడుగుతాం?

"అవున్లెండి ఆ మాటా నిజమే! ధర ఏమాత్రం ఉంటుందంటారు?" మళ్ళీ ఇంకో ప్రశ్న.

"వాళ్ళెంత పెట్టారో తెలియదుగానీ, నా అభిప్రాయంలో మాత్రం దీని ధర .... " చెప్పింది.

"ఆ!!" ఆశ్చర్యంతో నోరు తెరిచిందావిడ.

ఆవిడను అలాగే వదిలి అక్కడ నుంచి లేచి వచ్చేసింది కాత్యాయని. వెనుక నుంచి మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

"ఏ ఊరి చీర, ఎక్కడ కొన్నదీ తెలియదుట గాని ధర మాత్రం తెలుసుట.. మరీ బడాయి కాకపోతే. ఆ చీర అంత ఖరీదెందుకుంటుంది. మొన్నీమధ్య మా ఆడబడుచు కొనుక్కు వెళ్ళింది రంగు తేడా! ఆటో చార్జీలతో కలిపినా కూడా ఆవిడ చెప్పిన ధరలో సగం లేదు. ఎందుకో అంత బడాయిలు పోతారు" రకరకాలుగా వ్యాఖ్యానాలు.

## ఎందుకబ్బా?

టాబూకి స్పానిష్ భాష మీద ఎక్కడ లేని ప్రేమ పుట్టుకొచ్చింది! సినిమాల్లేక ఏదో



టైంపాస్‌కి ఈ పని చేస్తోందన్న వాదన ఉన్నా, ఆ భాషే ఎందుకు నేర్చుకుంటుందా అన్నది మరి కొందరి వాదన. రాత్రింబవళ్ళు స్పెషల్ టీచర్లని పెట్టుకొని ఆ భాష నేర్చు కోవడానికి నానా తంటాలు పడుతోందట. కారణమేంటో కనుక్కుందాం!

నవ్వుకుంది కాత్యాయని. "ఒక వస్తువు వెల దానికే పెట్టిన (ఖర్చు) రూపాయలేనా ఇంకా ఎన్నో ఉంటాయి. దానికి వెలకట్టే విషయాలు అన్నిటి సముదాయమే ఆ వస్తువు వెల" వాళ్ళకు ఇది ఎలా విడమర్చాలో తెలియక లోపల నుంచి వచ్చేసింది.

ఇంటికి వచ్చాక ... ఆ సంఘటన మనసులో మెదులుతూనే ఉంది. దానితోపాటు కొద్ది రోజుల ముందు జరిగిన సంఘటన కూడా మెదిలింది.

* * *

"ఏంటి విశేషం కనకమ్మా! కొత్త చీర కట్టావు?" కూరల బుట్ట కిందకు దింపుతూ అడిగింది కాత్యాయిని.

బుట్ట పక్కనే తల మీద గుడ్డ పెట్టి చతికిలబడుతూ, "ఏందమ్మా నీకు అంతా వేళాకోళం ఈ వర్షాలతో బట్టలుతికి ఆరేసుకోటానికి లేకపోయె! చిరిగిన చీరలు కడితే నీలాంటి అమ్మలు కోప్పడుతారాయె! డబ్బెంతా ఏం చేస్తున్నావే అంటూ. అందుకే మా పక్కింటి అక్కనడిగి తెచ్చుకున్నా"

"మీ పక్కింటి అక్కకు లేదా వర్షాకాలపు ఇబ్బంది" యథాలాపంగా అడిగింది.

"ఆమె చీరలు కాదమ్మా! ఆయమ్మకి హోటలు యాపారం అయితే శానా మంచిది. డబ్బు లేనివోళ్ళను సతాయించదు. దగ్గర ఏదుంటే అది పెట్టుకొని దాని లెక్క ప్రకారం ఒక రోజో రెండు రోజులో ఇంకా ఎక్కువ రోజులో భోజనం పెడుతుంది. ఆ సామాన్లు మాలాంటివాళ్ళకు అవసరానికి అద్దెకో, ధరకో ఇస్తుంది. ఇవాళ సాయంత్రం దీనికి దబ్బులు ఇచ్చేయాల" కూరలు తూచి, బుట్టలో పోసి, డబ్బులు తీసుకొని వెళ్ళిపోయింది.

కనకమ్మ వెళ్ళాక చాలాసేపు ఆ మాటలు వెంటాడాయి కాత్యాయనిని. చిన్నప్పుడెప్పుడో "కూటి కోసం కోటి విద్యలు" అనే నానుడి కంఠతా పట్టింది కానీ దాని అర్థం ఇప్పుడు స్పష్టమైనట్లు భావన. "అన్నీ అమరిన జీవితాలలో ఎన్నో విలువలు అర్థం కావు. ఎందుకంటే అవి అయాచితంగా అందుతాయి. లేనినాడే దేని విలువైనా తెలిసి వస్తుంది. అమ్మ అన్నట్లు మనిషి విలువైనా మనిషి పోయాకే తెలుస్తుంది. అసలు ఏ వస్తువుకైనా విలువ కట్టడం ఎలా?" అంతు తెగని ఆలోచనలు, ఆలోచన అర్థవంతమవటానికి ఇంకో సంఘటన తోడ్పడింది. ఆ రోజే ఆ సంఘటన జరగటం కేవలం యాదృచ్ఛికం.

పనిమనిషి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ హడావిడిగా లోపలకు వచ్చింది. "అబ్బ ఎంత వాన! చీర తడిసిపోతే వేరే మార్చుడు కూడా లేదు. ఇల్లంతా ముంచేట్టుంది. ...

యీ వాన. ఒక్కసారి ఫెళ్ళున ఎండ కాస్తే ఒక్క రోజులో అంతా శుభ్రం చేసుకోవచ్చు." ఆగకుండా సణుగుతూ పని చేసుకుపోతోంది. దాని చెయ్యి ఆడినంతసేపు నోరు ఆడుతూనే ఉంటుంది. "నోరు మూసుకుని పని చెయ్యరాదా!" అంటే బూతుమాట విన్నట్లు విరుచుకుపడుతుంది. అందుకనే అది ఉన్న కాసేపు భరించటమే నయమని కాత్యాయని నిశ్చయించేసుకున్నది. ఆ ఒక్కటి తప్ప పనిలో వంక పెట్టేందుకు లేదు. వాన రాని, వరద రాని పనికి నాగా పెట్టదు. ఎంతగా అలవాటు అయిందంటే అది నోరు మూసుకుని పని చేస్తే కాత్యాయనికి భయం పట్టుకుంటుంది.

పని పూర్తి అయ్యాక కాత్యాయని ఇచ్చిన కాఫీ తాగుతూ "అమ్మా! మీకు తెలుసా యీ సంగతి" అంది ఉపోద్ఘాతంగా.

"ఏ సంగతి?"

"అదే ఆ ముసలి దంపతులు మీ యింటికి అప్పుడప్పుడూ వస్తుండేవాళ్ళు.. అదేనమ్మా ఆ గుడ్డి ఆయన, ఆయన పెళ్ళాం" జ్ఞాపకం చేసింది.

"ఆ! ఆ! ఏమైంది వాళ్ళకు?" ఆత్రంగా అడిగింది కాత్యాయని.

"ఏం కాలేదులే! వాళ్ళు మా యింటి దగ్గరే ఇల్లు తీసుకున్నారు. ఇల్లంటే అదేలే. మాకు లాగే గది అద్దెకు తీసుకున్నారు. ఆ ముసలాయనకి రాత్రంతా జ్వరం. ఒకటే చలి. ఎగిరెగిరి పడిపోయాడు పాపం. ఆ గుడ్డిదానికి కళ్ళు కనిపించవు కదా! అయోమయం పడుతుంటే నేనే వెళ్ళి దగ్గర కూర్చుని ఆ బట్టా యీ బట్టా అన్నీ కలిపి ఆయనకు కప్పి, ఆమెకు ధైర్యం చెపుతూ కూర్చున్నా. తెల్లవారి డాక్టరు దగ్గరకు వెళ్ళేందుకు డబ్బులు లేవంటే నాకాడ ఉన్నవిచ్చి మా అబ్బాయినప్పజెప్పి ఇలా వచ్చా. ఇక పోతానమ్మా. ఇంకా రెండిళ్ళ పని ఉంది" కథ చెప్పటం అయినట్లు లేచి, గ్లాసు కడిగి బోర్లించి వెళ్ళిపోయింది.

ఆ ముసలి దంపతులంటే కాత్యాయనికి జాలి. ఎక్కడివారో ఏమో! పిల్లలున్నారో లేదో! చుట్టుపక్కల గురించి కూడా తెలియదు. ఇద్దరూ ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని ఒక చేత్తో కర్ర పట్టుకొని అప్పుడప్పుడూ కాత్యాయని దగ్గరకు వస్తుంటారు. వచ్చినప్పుడల్లా ఇంత భోజనం పెట్టి అడిగిన చిన్న చిన్న సహాయాలు చేస్తూ ఉంటుంది. డెబ్బయ్యేళ్ళ వయసులో వారు అలా బ్రతుకవలసి రావటం కాత్యాయని కెందుకో బాధ కలిగిస్తుంది. కానీ పెదవి విప్పని వారికి ఏం చేయగలదు? విప్పినా ఏం చేయగలదు? సానుభూతి చూపటం తప్ప. వారం క్రిందట వచ్చినప్పుడు బట్టలు లేవంటే మంచి చీరలు (తనకు కట్టుకోటం విసిగేసినవి) రెండు, ఒక పంచె ఇచ్చి పంపింది. పాపం అవి ఆ ముసలివాడి చలిని ఆపటానికైనా పనికి వచ్చాయో లేదో! ఏమిటో బ్రతుకులు!

మళ్ళీ వారం రోజుల దాకా వాళ్ళ గురించి అడగటానికి తీరిక చిక్కలేదు కాత్యాయనికి. ఇంటికి చుట్టాలు రావడంతో అందరూ వెళ్ళాక ఆ రోజు స్థిమితంగా పుస్తకం చదువుకుంటున్నప్పుడు వచ్చింది పనిమనిషి. తను కట్టుకున్న చీర పరిచయమున్న చీరలాగా ఉంది. అయినా అడగలేదు. పని పూర్తయి "వెళ్తున్నానమ్మా! ఇంకేమన్నా పనుందా? ఇక ఇంటికేలే" అన్నది పనిమనిషి.

"ఆ ముసలివాళ్ళు ఏమయినారే? జ్వరం తగ్గిందా?"

"ఆఁ అమ్మా! ఇవాళే గుడికాడకు వెళ్ళారు. అక్కడ పూజారయ్య వీళ్ళకు కాస్త ప్రసాదం పెట్టాడు. దానితో వీళ్ళకు కడుపు నిండుతుంది. పాపం ఒక వారం రోజులు చాలా బాధపడిపోయారు. జ్వరపు మనిషిని వదిలి వెళ్ళలేదు. ఒకరికొకరు తోడు లేకుండా నడవలేరు. నేనే మా యింటి దగ్గర హోటలు చిట్టెమ్మ దగ్గర ఏర్పాటు చేశాను భోజనం."

"ఎవరు కనకమ్మ చెప్పినావిడేనా?" వివరమడిగింది.

"ఆ! ఆమే! శానా మంచిది. డబ్బు తీసుకుని అన్నం పెట్టినా కొంచెం వెనుకా ముందూ చూస్తుంది. డబ్బు ఇవ్వలేనివాళ్ళని, వీళ్ళకు అన్నం ఊరికినే పెట్టానంది. కానీ ఆ ముసలామెకి చాలా అభిమానం. తన దగ్గర రెండు చీరలు ఒక పంచె నీవిచ్చిన వున్నాయట. అవి ఇచ్చి లెక్క కట్టుకోమంది. నేనే తీసుకెళ్ళి బేరం సెటిల్ చేశా. వారం రోజులు అన్నం పెట్టడమే కాక, కొంత డబ్బు ఎదురిచ్చింది ముసలాయన మందులకని. దాంట్లోనే ముసలామె నా డబ్బు నాకిచ్చేసింది. దాంతోనే నేనీ రెండు చీరలు చిట్టెమ్మ దగ్గర కొన్నా. గుర్తు పట్టలా! నీవిచ్చిన చీరే ఇది. నాకెరికే కదా నీ చీరలు. అందుకే కొనేసుకున్నా. నీ చేతి చలవ వలన ముసలి దంపతుల ప్రాణాలు నిలిపింది."

"ఎంతకు కొన్నావేమిటి?"

"చీర పాతిక. మొత్తం యాభై. వస్తానమ్మా పనేం లేదుగా మరి" అంటూ వెళ్ళిపోయింది.

"చీర పాతిక. మొత్తం యాభై" అదే మాట మనసులో సుడులు తిరుగుతోంది కాత్యాయనికి. "నిజంగా ఆ చీర వెల ఎంత? నేను పెట్టిన వెయ్యి రూపాయలా! నేతగాడికి అందిన 200 రూపాయలా? మధ్యవర్తికి అందిన ఆరొందలా! చిట్టెమ్మకు వచ్చిన పాతిక రూపాయలా? ఇదేదీ కాక ఆ ముసలి దంపతులకు లభించిన వారం రోజుల భోజనమా!" కాత్యాయని మనసులో ఎన్నో ఆలోచనలు. ❋

